‘కల్లుగీత’ జోలికొస్తే సహించేది లేదు

గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కల్లుగీత వృత్తి జోలికి వస్తే సహించేది లేదని గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్ హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొంత కాలంగా కల్లుగీత వృత్తిపై కల్లుదుకాణాలపై అక్రమంగా ఎక్సైజ్ అధికారులు, నార్కోటిక్ అధికారులు, పోలీసులు దాడిచేస్తున్నారని ఈ చర్యలను తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం ఉన్నప్పుడు గౌడలపై విచక్షణ రహితంగా దాడులు చేసి వేలాది గీతా సొసైటీలను రద్దు చేసిన చరిత్ర ఉందన్నారు. తిరిగి మళ్లీ అప్పటి రోజులు గుర్తు చేస్తున్నారా అని ప్రశ్నించారు.

◆ తెలంగాణ ఏర్పడిన నాటి నుంచిఎక్సైజ్ శాఖకు గౌడ్‌లే మంత్రులుగా కొనసాగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం వెలమదొర జూపల్లి కృష్ణారావుకు ఆశాఖను కేటాయించడంతో కల్లుగీత వృత్తికి తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంపిళ్ల పేరుతో, కల్తీ కల్లు నెపంతో నార్కోటిక్ అధికారులు, పోలీసులు, అబ్కారీ అధికారులతో కలిసి ఏక కాలంలో రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అప్రకటిత దాడులు చేస్తున్నారని అన్నారు. తక్షణమే జూపల్లి కృష్ణారావును మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. కల్లుగీత వృత్తిని ఎక్సైజ్ శాఖ నుంచి తొలగించి స్వయం ప్రతిపత్తి కలిగిన శాఖగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోని కల్లుగీత సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసింది పాటే..

• కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా • ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ఉద్యమంతో పాటు రాజకీయ సాంస్కృతిక ఉద్యమాలకు పాటే ప్రాణం పోసిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం ''పాటల పల్లకిలో 32 గంటలు – దగాపడ్డ కళాకారుల డప్పులమోత''ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్రపోషించిన ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తెలంగాణ నినాదాన్ని ఊరు ఊరుకు తీసుకుపోయింది పాటేనని, చదువురాని వారు కూడా అర్థం చేసుకొని ఉద్యమంలో భాగస్వాములు అయ్యారని గుర్తుచేశారు. మన రాష్ట్రంలో అద్భుతమైన కళాకారులు ఉన్నారని అయితే నేడు కళాకారుల అందరికి పొట్టతిప్పల ఉందన్నారు. సమాజంలో మార్పు తీసుకురావడానికి ఈ పాటే కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం

ప్రముఖ గాయకుడు నేర్నాల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత జయరాజు, గాయకుడు వేపూరి సోమన్న, నల్లగొండ గద్దర్, నర్సిరెడ్డి, గిరిజన అభివృద్ధి శాఖ చైర్మన్ బెల్లయ్య నాయక్, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నల గద్దర్, వరంగల్ రవి, దరువు ఎల్లన్నతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా కవులు, కళాకారులు పాల్గొన్నారు.

అధ్వానంగా మారిన రోడ్లను ఆధునీకరించాలి



జీహెచ్ఎంసీ కమిషనర్ నీలాంబరికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుప్రియ

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులను పూర్తి చేసి రోడ్లు వేయకపోవడం వల్ల అధ్వానంగా మారిన రోడ్ల వల్ల ప్రజలు ప్రమాదాలకు లోనవుతున్నారని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. రోడ్ల ఆధునీకరణకు నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ నీలాంబరీని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పలుమార్లు అధికారులకు లేఖలు రాశారని అయినా రోడ్డు పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. గంగపుత్రకాలనీ, భరత్‌నగర్, బాపూజీనగర్, ఏక్‌మినార్ ప్రాంతాలలో రోడ్లను ఆధునీకరించేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. గతంలో సైతం ఈ ప్రాంతాలలో రోడ్ల ఆధునీకరణకు నిధులు మంజూరైన పనులు చేపట్టకపోవడం వల్ల నిధులు వెనక్కు వెళ్లాయని ఆరోపించారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే రోడ్లను ఆధునీకరించాలని పేర్కొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మహాపడి పూజ



ముషీరాబాద్‌లో జరిగిన పడిపూజలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, నందికంటి గోపాల్‌రావు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని పోల్‌బాల్ ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం కోడూరు రాజు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడి పూజను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప మాల ధరించి 41 రోజులు కఠోర దీక్షతో పూజలు నిర్వహిస్తూ అధ్యాత్మిక భావనను పెంపొందిస్తున్నారన్నారు. అనంతరం వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ బీఆర్ఎస్ నాయకులు నందికంటి గోపాల్‌రావు, డి.శివ ముదిరాజ్, శ్రీధర్‌చారి, దేవరాజ్, రాజ్‌కుమార్, జె.ఎస్.పటేల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన అంతర్గత రోడ్ల అభివృద్ధి

అంబర్‌పేట: నియోజవర్గ వ్యాప్తంగా అంతర్గత రోడ్ల మరమ్మతులకు ప్రత్యేక చొరువ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ మున్సిపాల్ కాలనీలో రూ.17లక్షల అంచనా వ్యయంతో అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులను కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బస్తీలు, కాలనీలో ప్రత్యేకంగా పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు లవంగం ఆంజనేయులు, సతీష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపాల్ కాలనీలో అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

అంబర్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించొద్దని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. మౌళిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. శుక్రవారం బాగ్ అంబర్‌పేటలోని ప్రజా సమస్యలపై స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. డివిజన్‌లోని శాంతినగర్, బతుకమ్మ కుంట ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడి ప్రజలు డ్రైనేజీ, అంతర్గత రోడ్లు వంటి సమస్యలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రజలు తలెత్తిన సమస్యలను తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకువాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



బాగ్ అంబర్‌పేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్హత ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో డిసెంబర్ 21వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించేందుకు అవసరమైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషిన్ లార్నింగ్ బిజినెస్ అనలిటిక్స్, దేవోప్స్, ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, పైథాన్, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, బ్లాక్‌చైన్ వంటి 100కి పైగా కంప్యూటర్ సర్టిఫికేషన్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ విదేశాలలో ఉత్తమ ఉపాధి అవకాశాలున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్.95058 00050లో సంప్రదించాలని సూచించారు.

సోలార్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఏర్పాటుపై ఉచిత శిక్షణ

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా సోలార్ ఏర్పాటు, నైపుణ్య అభివృద్ధి అంశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి సుదర్శన్ తెలిపారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుదారు. సోలార్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇతరులకు సోలార్ ఏర్పాటు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి లైసెన్స్ సైతం మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. అలాగే సోలార్‌లో బిజినెస్ కమ్యూనికేషన్ స్కిల్స్‌లో కూడా నిపుణులచే ప్రత్యేక శిక్షణ ఇస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం.94949 59108లో సంప్రదించాలని కోరారు.

బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌రావుకు గాయాలు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. అయ్యప్పమాల ధరించిన వై.శ్రీనివాస్‌రావు సికింద్రాబాద్‌లోని అయ్యప్పస్వామి ఆలయానికి వెళ్లి ఇంటికి వస్తుండగా పద్మారావునగర్ చౌరస్తా వద్ద ఆయనను బైక్ ఢీకొట్టడంతో తల, కాలు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువ నేత ముఠా జైసింహ రంగానగర్‌లోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు మహ్మద్ ఆలీ, శ్రావణ్, బాక్సర్ కృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

జన గణనతో పాటు కుల గణన చేపట్టాలి

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: దేశ జన గణనతో పాటు కుల గణనను కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా చేపట్టాలని, లేనిపక్షంలో ఢిల్లీని ముట్టడిస్తామని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో నిర్లక్ష్యానికి, వివక్షతకు గురవుతున్న బీసీలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. రైతులు తమ డిమాండ్ల సాధన కోసం ఎలాగైతే దేశ రాజధానిని ముట్టడించాలని అనుకున్నారో అదే తరహాలో బీసీలు ఢిల్లీని ముట్టడిస్తారని ఆయన హెచ్చరిచారు. జనగణనలో కులగణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. దేశ సంపదను కేవలం కొందరికే పరిమితం చేయకుండా అందరికీ పంచాలన్నదే తమ లక్ష్యమని, ఆ దిశగా జాతీయ బీసీ దళ్ ఉద్యమిస్తుందని అన్నారు. 2010లో కేంద్రంలో ప్రతిపక్షంలో బీజేపీ ఉన్నప్పుడు జనాభా గణనలో కులగణన చేపట్లాని డిమాండ్ చేసిందని, అలాగే 2018లో అప్పటి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జనగణనలో కులాల వారీ వివరాలు సేకరించాలని నిర్ణయం తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు. బీసీ కమిషన్ కులగణన చేయాలని సిఫార్సులు కూడా చేసిందన్నారు. కేంద్రం స్పందించకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీదళ్ గ్రేటర్ అధ్యక్షుడు రాజేష్‌యాదవ్, వెంకటరమణ, రాజు, మల్లేశం, రవి తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న దుండ్ర కుమారస్వామి

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి



లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ డా.అక్తర్ షమీమ్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

కవాడిగూడ: ఎస్సీ ఏ,బీ,సీ,డీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతులు ఇస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని దాని ఆధారంగా ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంపీఎఫ్, ఎంఎంఎస్, ఎంవైఎస్ సంఘాలు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంపీఎఫ్, ఎంఎంఎస్, ఎంవైఎస్ సంఘాలు స్వాగతిస్తున్నామని ఆ సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ డాక్టర్ అక్తర్ షమీమ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ మాదిగ రాజకీయ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బీఎస్ రమేష్‌కుమార్, వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ... తెలంగాణలో మాదిగ, మాదిగ ఉపకులాల జనాభా నిష్పత్తి ప్రకారం వాటా దక్కేలా రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరిగేంత వరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వొద్దని చైర్మన్‌ను కోరారు.

మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: త్వరలో చేపట్టబోయే తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. జనాభాలో 60శాతం ఉన్న బీసీలకు 2 మంత్రి పదవులు, 6శాతం జనాభా ఉన్న రెడ్లకు సీఎం సహా 4 మంత్రి పదవులు కట్టబెట్టడమేంటని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... మంత్రివర్గ విస్తరణలో సమాజిక న్యాయం పాటించకపోతే కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. జనాభా దామాషా ప్రకారం పదవుల్లో అవకాశం కల్పించాలని మాట్లాడే రాహుల్ గాంధీ తెలంగాణలో ఆ సామాజిక న్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పోస్టులు, ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లోనూ సామాజిక న్యాయం పాటించాలన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాయనున్నట్లు తెలిపారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలి

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ పునరుద్ధరణ కమిటీ నూతన చైర్మన్‌గా జానకీసుధాకర్ ఎన్నికయ్యారు. ఆయనతో పాటు 17 మంది కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు పద్మావతి, ముక్కా రామకృష్ణ, గంధి హరీష్, నెల్లి శ్యాంకుమార్, సరళ నీతరాణి, లక్ష్మీనారాయణరావు, కందిసుబ్బారావు, అమురబాలకుమార్, దాసరి నవీన్‌ప్రసాద్, వెన్నలకంటి వెంకట శిశుకుమార్, క్తొతూరి వెంకటప్రతాప్‌కుమార్, తెలగమశెట్టి లోకంత్, ఎ.వెంకట్‌రావ్, మురికిగణేష్, ఎంటీ కోటేశ్వర్‌రావు, ఓరుగంటి మోహన్‌రావులు ఆయనను సన్మానించి అభినందించారు.

◆ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడారు. రెనోవెషన్ కమిటీ సభ్యులంతా ఐక్యంగా దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మికత కార్యక్రమాలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు.



ఆంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ కమిటీ నూతన సభ్యులతో చైర్మన్ జానకీసుధాకర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్

◆ అనంతరం జానకీసుధాకర్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తాన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎం.దేవనాథం, ఇన్‌స్పెక్టర్ సురేఖ, నేతలు గోవింద్, వీడి కృష్ణ, శీలం సత్యనారాయణ, గుర్రంశంకర్, అభిషేక్ కెనడీ, జయేందర్‌బాబు, గంగంరవి, నర్సింగ్ రావు ముదిరాజ్, గుండు జగదీష్ బాబు, మేడి సురేష్, మారిశెట్టినర్సింగరావు, సాయికీర్త్ బాబ్జీ, యాదగిరిగౌడ్, మధుమతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధన వైపు వెళ్లాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థులు పరిశోధనల వైపు వెళ్లాలని ప్రొఫెసర్ కె. శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులు సమాజంలోని డ్రగ్స్ మహ్మమారిని పారద్రోలేందుకు కృషి చేయాలన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ నివారణపై మూడు రోజులపాటు జరిగే అవగాహన సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... విద్యార్థులు చైతన్యవంతమై గంజాయి లాంటి మత్తు పదార్థాల బారిన పడకుండా ఇతరులకు ఆదర్శంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల బారిన పడి విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ... ఆధునీక కాలంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం వైపు పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త సుబ్బిరామిరెడ్డి, పి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం సెమినార్‌లో అతిథులుగా పాల్గొన్న ప్రొఫెసర్‌లను సన్మానించారు.



అంబేద్కర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రొ. కె.శ్రీనివాస్

నేడు వైఎంసీఏలో క్రిస్మస్ వేడుకలు

కాచిగూడ: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ, మైనార్టీ విభాగం జాతీయ కో–ఆర్డినేటర్ గద్దపాటి విజయరాజ్ నేతృత్వంలో ఈనెల 14వ తేదీన సాయంత్రం 5 గంటలకు సికింద్రాబాద్‌లోని వైఎంసీఏలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏకే గిడియోను బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు సీడబ్ల్యూసీ మెంబర్ కొప్పుల రాజు, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు పాల్గొంటారని తెలిపారు. క్రిస్మస్ సందేశం అందించడానికి అంతర్జాతీయ ప్రసంగీకులు జాన్ వెస్లీ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. క్రైస్తవ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. వివరాలకు సెల్: 9652799777 లో సంప్రదించాలని సూచించారు.

నేడు టీఈసీఏ కార్యవర్గ సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్(టీఈసీఏ) కార్యవర్గ సమావేశం శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎర్రగడ్డ సుందర్‌నగర్‌లో ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీసీరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి విద్యుత్ కాంట్రాక్టర్లంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎన్నిక కూడా ఉంటుందని ప్రకటించారు.

31న జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు చివరి గడువు

అంబర్‌పేట: జననమరణ ధ్రువీకరణ పత్రాలను ఇప్పటి వరకు పొందని వారికి ఈనెల 31వ తేదీ వరకు ప్రత్యేక అవకాశం కల్పించింది. 2010 సంవత్సరానికి ముందు జన్మించిన, మరణించిన వారు ఈనెల 31వ తేదీలోపు తమ పేర్లపై ధ్రువీకరణ పత్రం పొందాలని జీహెచ్ఎంసీ సర్కిల్–16 ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమాలత తెలిపారు. సెక్షన్ 14 ప్రకారం 31 డిసెంబర్ నాటికి ప్రభుత్వ జీవో ప్రకారం గడువు ముగుస్తుందన్నారు. అనంతరం 15 ఏళ్లు గడిచిన వారికి జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడానికి అవకాశం ఉండదన్నారు. అర్హులైన వారు, ధ్రువీకరణ పత్రాలు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మల తొలగింపు



కాచిగూడ: నింబోలిఅడ్డ ప్రధాన రోడ్డుకు ఇరువైపుల ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారు. ఈ పనులను కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ శుక్రవారం దగ్గర ఉండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెట్ల కొమ్మల మధ్యలో స్ట్రీట్ లైట్స్ ఉండటంతో రోడ్డు చీకటిగా మారుతోందన్నారు. చాలా చెట్ల కొమ్మలు ఎప్పుడు విరిగి మీద పడుతాయోననే వాహనదారులు, స్థానికులు భయపడేవారని అన్నారు. ఇవ్వన్ని దృష్టిలో పెట్టుకుని చెట్లకొమ్మలను తొలగించామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రామకృష్ణ, రవియాదవ్, మల్లికార్జున్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడా రైతుకు ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలి

కాచిగూడ: కొడంగల్ లగచర్ల గిరిజన లంబాడా రైతుకు ఏమైనా జరిగితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ నాయక్ అన్నారు. సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల గిరిజన రైతు వీర్యానాయక్‌కు గుండెపోటు రావడంతో జైలు అధికారులు ఆసుపత్రికి తరలించారని అన్నారు. వీర్యానాయక్‌కు అందుతున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనకు మంచి వైద్య పరీక్షలు అందించి ఆదుకోవాలని ఆయన ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత కొద్ది రోజుల నుంచి లంబాడా గిరిజనులపై పెట్టిక అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లంబాడాలపై కక్ష కట్టి ప్రభుత్వం ఈ విధంగా ప్రవర్తించడం మూర్ఖపు చర్య అని అన్నారు. వీర్యానాయక్‌కు ఏమీ కాకుండా ప్రభుత్వం మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

‘ఒక వెలుగు రేఖ’ పుస్తకావిష్కరణ



సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ శాంతాసిన్హా

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రముఖ రచయిత, హైకోర్టు అడ్వకేట్ హేమలలిత రచించిన ఒక వెలుగు రేఖ పుస్తకాన్ని ప్రొఫెసర్ శాంతాసిన్హా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆడపిల్లల హక్కులు, ఆడపిల్లల జీవితాలకు సంబంధించి వివిధ అంశాలను రాశారని అన్నారు. ఇలాంటి పుస్తకాలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. ఈ పుస్తకం ఆడపిల్లల్లో ధైర్యాన్ని నింపే విధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొండవీటి సత్యవతి, డాక్టర్ మమత రఘువీర్, వి. సంధ్య, ఎం.వీ.ఎఫ్ ఫౌండేషన్ కన్వీనర్ ఆర్ వెంకట్‌రెడ్డి, రచయితలు జె. సుబద్ర, జబీన్, కె. హిమబింధు, మండారు విజయ, కృపాకర్‌మాదిగ, కె.జె. రామరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు చైన్‌స్నాచర్ల రిమాండ్



అంబర్‌పేట: వేర్వేరు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డ ముగ్గురు స్నాచర్లను పోలీసులు అరెస్ట్ రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అడిషినల్ డీసీపీ జె.నర్సయ్య, ఏసీపీ రఘు, ఇన్‌స్పెక్టర్ అశోక్ వివరాలు వెల్లడించారు. సైదాబాద్‌కు చెందిన మహ్మద్ ఆవేజ్ అమీద్(42), కిషన్‌బాగ్ చెందిన అబూద్‌బిన్ ఆజీ(28), చార్మినార్‌కు చెందిన నితేష్ కిషన్ పాటిల్(32)స్నేహితులు. వీరు గోల్నాక, కాచిగూడ ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితులను వారి ఇంటి వద్ద పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5లక్షలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.